కోలాహలంగా ఉగాది

మనుబోలు : క్రోధినామ ఉగాది పర్వదినాన్ని మంగళవారం మండలంలో ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లో ప్రజలు ఉదయమే తల స్నానాలాచరించి షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని కుటుంబ సభ్యులతో కలిసి రుచి చూశారు. ఆపై దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వచనాలు తీసుకున్నారు. ఉగాదిని పురస్కరించుకుని మనుబోలులోని గంగమ్మ ఆలయాన్ని విద్యుద్దీపాలతో ముస్తాబు చేశారు. ఆలయ అర్చకుడు సుబ్రహ్మణ్యంశర్మ గంగమ్మకు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు గావించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. సాయంత్రం అమ్మవారిని మేళతాళాల మధ్య ఊరేగించారు. ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ చేశారు. మనుబోలు కోదండ రామపురంలోని పోలేరమ్మ ఆలయంలో అర్చకులు శ్రీనివాసులు పోలేరమ్మకు ప్రత్యేకాలంకరణ చేశారు. భక్తులు విశేషంగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆలయాల్లో..

పొదలకూరు : పట్టణంలోని ఆలయాల్లో క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెలుగు పండగ విశిష్టతను తెలియజేసేందుకు సంప్రదాయ దుస్తుల్లో భక్తులు దేవస్థానాలకు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. శిరిడీ సాయిబాబా మందిరంలో విశేష పూజలు జరిగాయి. గీతా మందిరంలో తెల్లవారుజామున స్వామివారి మేలుకొలుపు, గీతాపారాయణం, కృష్ణ భగవానునికి సహస్రనామ పూజలు, మధ్యాహ్నం సామూహిక కుంకుమార్చన, భజనలు, తీర్థప్రసాద వినియోగం జరిగింది. పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న లక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో పంచాంగ శ్రవణం వినిపించారు. అయ్యప్పనగర్‌లో ఉన్న శ్రీదేవి భూదేవి కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో, కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి, విఘ్నేశ్వరాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు ప్రసాద్‌స్వామి ఉగాది పచ్చడిని భక్తులకు పంచిపెట్టారు.



పొదలకూరు : వెంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

వేడుకగా గ్రామోత్సవం

కొడవలూరు : క్రోధినామ తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కొడవలూరులోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీధరస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాంగ శ్రవణం జరిపించి భక్తులకు ఉగాది పచ్చడిని పంచిపెట్టారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు గ్రామోత్సవం జరిగింది. గ్రామ వీధుల్లో ఊరేగుతున్న స్వామి వార్లకు భక్తులు నైవేద్యాలు సమర్పించారు. ఆలయ అర్చకుడు పవన్‌కుమార్ స్వామి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

కాంతమ్మతల్లి ఆశ్రమంలో..

పొదలకూరు : క్రోధినామ ఉగాది సందర్భంగా మండలంలోని ఇనుకుర్తి గ్రామంలో ఉన్న శ్రీకాంతమ్మతల్లి ఆశ్రమంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, పూలంగిసేవ, పట్టువస్త్రాల సమర్పణ, అర్చకుడు శ్రీనివాసశర్మ మృత్యుంజయ హోమం గావించారు. గొలగమూడికి చెందిన పులిమి నరేంద్ర–మోహన దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఉత్సాహంగా..

ఇందుకూరుపేట : ఉగాది పండగను మండల వాసులు మంగళవారం ఉత్సాహంగా జరుపుకున్నారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రముఖ పుణ్యక్షేత్రం గంగపట్నంలోని చాముండేశ్వరీదేవి అమ్మవారి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

➡ తోటపల్లిగూడూరు : తెలుగు సంవత్సరాది ఉగాదిని మండల వాసులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తమ పితృదేవతలకు కొత్త దుస్తులు, పిండి వంటకాలను అర్పించుకున్నారు. అలాగే పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. వరిగొండలోని జ్వాలాముఖి ఆలయం, పేడూరు చాముండేశ్వరీదేవి ఆలయం, నరుకూరు రాజరాజేశ్వరి ఆలయం, కాటేపల్లి శివాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి.



మనుబోలు : ప్రత్యేకాలంకరణలో గంగమ్మతల్లి



మనుబోలు : పోలేరమ్మ ఆలయంలో..



కొడవలూరులో శ్రీదేవి భూదేవి సమేత శ్రీధరస్వామి గ్రామోత్సవం



పొదలకూరు : మృత్యుంజయ హోమం

క్లుప్తంగా

ఆంజనేయస్వామికి విశేష పూజలు



విశేషాలంకరణలో ఆంజనేయస్వామి

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి అర్చకులు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, పూజలు, సాయంత్రం స్వామికి పల్లకిసేవ గావించారు.

తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ



పొదలకూరు : త్రైత సిద్ధాంత ఉగాది తెలుగు క్యాలెండర్‌ను మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. పొదలకూరు మండలానికి చెందిన త్రైత సిద్ధాంత ప్రబోధకులు మంత్రిని కలిసి క్యాలెండర్‌ను ఆవిష్కరింప చేశారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ త్రిమత గురువు ఆధ్యాత్మికవేత్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల దివ్య ఆశీస్సులతో క్యాలెండర్‌ను రూపొందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత సేవా సమితి పొదలకూరు కమిటీ సభ్యులు జి.పెంచలనర్సయ్య, కేవీ రత్నం, జి.నరసింహప్రసాద్, బట్టేపాటి నర్సారెడ్డి, పద్మజాతో పాటు 200 మంది సభ్యులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయంలో విశేష పూజలు



విద్యుద్దీపాల వెలుగులో గంగమ్మ ఆలయం

మనుబోలు : ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మనుబోలు మండల కేంద్రంలో ఉన్న గంగమ్మ ఆలయాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంగళవారం రాత్రి దర్శించుకున్నారు. ఏటా ఉగాది పర్వదినాన్ని వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా అర్చకుడు సుబ్రహ్మణ్యంశర్మ గంగమ్మకు ప్రత్యేక పూజలు చేసి మంత్రి కాకాణికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. మంత్రి వెంట వైఎస్సార్‌సీపీ నేతలు బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, బొమ్మిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, దుగ్గన వేణుగోపాల్, ముంగర రవీంధర్‌రెడ్డి, అనమాల ప్రభాకర్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, ఏలూరు భాస్కర్‌రెడ్డి, దాసరి మహేంద్రవర్మ, కోటేశ్వరగౌడ్, పార్థు తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న మంత్రి కాకాణి

నిత్యాన్నదాన పథకం ప్రారంభం



నెల్లూరు(బృందావనం): స్టోన్‌హౌస్‌పేటలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో నిత్యాన్నదాన పథకాన్ని నుడా చైర్మన్, దేవస్థాన కమిటీ చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రోధి నామ తెలుగు సంవత్సరాన్ని పురస్కరించుకొని నిత్యాన్నదాన పథకానికి శ్రీకారం చుట్టామని వివరించారు. అర్బన్ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు బైసాని జ్యోతిప్రసాద్, దేవస్థాన పాలకమండలి చైర్మన్ శ్రీరామ్ సురేష్, డాక్టర్ మల్లికార్జునరావు, వైభవ్ శ్రీనివాసులు, కొణిజేటి వీరబ్రహ్మం, బైసాని సత్యకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాఘవాచార్యులుకు జ్యోతిష్య పురోహిత్ బిరుదు

నెల్లూరు(బృందావనం): వెంకటాచలంలోని పూడిపర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న రాఘవాచార్యులుకు జ్యోతిష్య పురోహిత్ బిరుదును ప్రదానం చేశారు. రాజమహేంద్రవరంలోని విశ్వజ్యోతి జ్యోతిష్య విజ్ఞాన సంస్థ నిర్వహించిన వైదిక జ్యోతిష్య సమ్మేళనంలో ఈ బిరుదును ప్రదానం చేశారని ఆయన తెలిపారు.

నేడు జొన్నవాడలో ఎన్నికల ప్రచారం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని జొన్నవాడలో వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు విజయసాయిరెడ్డి, ప్రసన్నకుమార్‌రెడ్డి బుధవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని ఆ పార్టీ మండల కన్వీనర్లు మల్లికార్జునరెడ్డి, సతీష్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పోలేరమ్మకు పొంగళ్ల సమర్పణ

పొదలకూరు : మండలంలోని డేగపూడి గ్రామంలో పోలేరమ్మకు భక్తులు మంగళవారం పొంగళ్లు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి దేవస్థానాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. గ్రామం సుఖసంతోషాలు, పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని భక్తులు సామూహిక పొంగళ్లను పెట్టుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పేకాట స్థావరంపై దాడి

• ఏడుగురి అరెస్ట్

పొదలకూరు : మండలంలోని అమ్మవారిపాళెం పొలాల్లో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై మంగళవారం పోలీసులు దాడులు జరిపారు. ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసి, నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై రామకృష్ణ కథనం మేరకు.. పక్కాగా అందిన సమాచారం మేరకు జరిపిన దాడిలో ఏడుగురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా వారి నుంచి రూ.22,160 నగదును స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేశారు.

ఎస్పీ ఆకస్మిక తనిఖీ



వాహన తనిఖీలను పరిశీలిస్తున్న ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : బుచ్చిరెడ్డిపాళెం టోల్ ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో రూ.50 వేలకు మించి తీసుకెళ్లకూడదని సూచించారు. ఒక వేళ తీసుకెళ్తే సంబంధిత ఆధారాలు చూపించాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై పోలీసు సిబ్బంది నిరంతర పర్యవేక్షణ ఉంచాలని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్పీ వెంట సీఐ హైమారావు, సిబ్బంది ఉన్నారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం

వెంకటాచలం : ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు సీఐ అంకమరావు తెలిపారు. మండలంలోని వెంకటాచలం, కసుమూరు, ఇడిమేపల్లి గ్రామాల్లోని పలు వీధుల్లో కేంద్ర బలగాలతో కలిసి మంగళవారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రశాంత ఎన్నికలకు ప్రతిఒక్కరూ సహకరించాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్సై రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



వెంకటాచలంలో కవాతు చేస్తున్న కేంద్ర బలగాలు

ఐదేళ్లలో ఊహకందని అభివృద్ధి



మంత్రి కాకాణిని గజమాలతో సన్మానిస్తున్న నాయకులు



ప్రచారంలో పాల్గొన్న ప్రజలు

• రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం : గడిచిన ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సర్వేపల్లి నియోజకవర్గంలో ఎవరూ ఊహించని విధంగా అభివృద్ధి పనులు చేయించామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కాకుటూరు గ్రామంలో మంగళవారం సాయంత్రం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చేరుకున్న మంత్రి కాకాణికి స్థానికులు అడుగడుగునా బ్రహ్మరథం పలికారు. ప్రజలు విశేషంగా తరలివచ్చి పూలు, కర్పూర హారతులతో స్వాగతం పలికారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు గజమాలతో సన్మానించారు. జై జగన్.. జై కాకాణి నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో మంత్రిగా పనిచేసిన సోమిరెడ్డి అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఇష్టారాజ్యంగా దోపిడీకి పాల్పడ్డాడని విమర్శించారు. నీరు–చెట్టు, రైతు రథం, మిల్లర్ల వద్ద ముడుపులు ఇలా ప్రతి పథకంలో అడ్డగోలుగా కమీషన్లు దోచుకున్నాడన్నారు. తాము అధికారంలోకి వచ్చాక కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు పూర్తి చేశామని, రాష్ట్రంలోనే సర్వేపల్లిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దామని తెలియజేశారు. ఎక్కడా మట్టిరోడ్డు కనిపించకుండా సీసీరోడ్లు, సైడు కాలువలు నిర్మించినట్లు వివరించారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించి లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేసి హక్కులు కల్పించామన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ప్రజా సంక్షేమ పాలన కొనసాగేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కొణిదెన మోహన్‌నాయుడు, పార్టీ నాయకులు రాచాల రవికుమార్ యాదవ్, కొణిదెన విజయభాస్కర్‌నాయుడు, కుంకాల శ్రీలత, జనార్థన్, పరంధామయ్య, సునీల్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో విద్యుత్‌శాఖ డైరెక్టర్

ఇందుకూరుపేట: తెలంగాణ రాష్ట్ర విద్యుత్‌శాఖ డైరెక్టర్, మండలంలోని పున్నూరు గ్రామవాసి కొమరగిరి నందకిశోర్ మంగళవారం ప్రముఖ పుణ్యక్షేత్రమైన గంగపట్నంలోని చాముండేశ్వరీదేవి, లేబూరులోని కుంకాళమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సిబ్బంది ఆయనకు సాదర స్వాగతం పలికారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఏడీ సునీల్‌కుమార్, నరసాపురం ఏఈ నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.



ఆలయ ఆవరణలో నందకిశోర్

వైఎస్సార్‌సీపీతోనే అన్నివర్గాలకు మేలు



పొదలకూరు : ఇంటింటి ప్రచారం చేస్తున్న పూజిత



కొడవలూరు: కొత్తవంగల్లులో..

పొదలకూరు : ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్నివర్గాల ప్రజలకు మేలు జరిగిందని, మీ కుటుంబ సభ్యునిగా సేవలు అందించిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఆదరించాల్సిందిగా ఆయన కుమార్తె పూజిత ఓటర్లను అభ్యర్థించారు. పొదలకూరు పట్టణం రామనగర్ గేటుసెంటర్ మెయిన్‌లో మంగళవారం ఆమె ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన తండ్రి స్థానికుడిగా ఎవరికి ఏమి కావాలో తెలుసునన్నారు. కరోనా కష్టకాలంలో ప్రతి కుటుంబాన్ని ఆదుకుని సరుకులు పంపిణీ చేసినట్లు తెలిపారు. పట్టణంలోని ప్రతివీధిలో సిమెంటురోడ్లతో పాటు సైడ్‌డ్రెయిన్లను నిర్మించారని, తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. తొలుత పూజితకు స్థానికులు ఘనస్వాగతం పలికారు. ఆమె వెంట జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ, వైస్ ఎంపీపీ సోమా అరుణ, ఎంపీటీసీలు జి.లక్ష్మీకల్యాణి, జి.శ్రీనివాసులు, సర్పంచ్ చిట్టెమ్మ, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, వార్డుసభ్యులు కండే వాసుదేవరావు, అంజాద్, నాయకులు ఎం.శేఖర్‌బాబు, కె.అంకిరెడ్డి, ఎం.శివశంకర్, జి.వేణుగోపాల్‌రెడ్డి, వాకాటి శివప్రసాద్‌రెడ్డి, ఎస్.శ్రీనివాసులురెడ్డి, జి.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తవంగల్లులో..

కొడవలూరు: వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేణుంబాక విజయసాయిరెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విజయం కోసం మండలంలోని కొత్తవంగల్లులో వైఎస్సార్‌సీపీ నేత సి.మనోహర్‌బాబు ఆధ్వర్యంలో మంగళవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరిగి గ్రామాభివృద్ధి చెందాలంటే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మనోహర్‌బాబు మాట్లాడుతూ గాంధీ కలలు కన్న గ్రామస్థాయి పాలనకు శ్రీకారం చుట్టిన మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాలన్నారు. ఐదేళ్ల పాలనలోనే రాష్ట్రంలో ఎన్నో మార్పులు తీసుకొచ్చిన జగనన్నకు మరలా అవకాశం కల్పిస్తే దేశంలోనే ఏపీని ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దుతారన్నారు. జిల్లాను అభివృద్ధి చేయగల సత్తా ఉన్న విజయసాయిరెడ్డిని, నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేసే ప్రసన్నకుమార్‌రెడ్డిలను గెలిపించుకుని మన ముఖ్యమంత్రికి బహుమతిగా ఇద్దామని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు నంబూరి ప్రసాద్, సర్పంచ్ ఆమవరపు సింధు, సచివాలయ కన్వీనర్ వేముల వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు చక్కా శూలం హరిబాబు, వేముల రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

కోడింగ్‌లో ప్రతిభ

కొడవలూరు : నార్తురాజుపాళెంలోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి కోడింగ్ కాంపిటీషన్‌లో మొదటి బహుమతి సాధించారు. చెన్నై ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, యూఎస్ఏ టెక్సాస్ యూనివర్సిటీ వారు సంయుక్తంగా కోడింగ్ కాంపిటీషన్ నిర్వహించారు. ఈ పోటీలో వెంకటేశ్వర కళాశాల సీఎస్ఈ ద్వితీయ సంవత్సర విద్యార్థి వంశీకృష్ణ ప్రతిభ కనబరిచి మొదటి బహుమతి గెలుచుకుని 300 యూఎస్ డాలర్‌లను సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా వంశీకృష్ణను కళాశాలలో చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్ మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు.



బహుమతి అందుకుంటున్న వంశీకృష్ణ

మద్యం బాటిళ్ల స్వాధీనం

మనుబోలు : మండలంలోని బద్దెవోలు గ్రామానికి చెందిన ఆల్వారుశెట్టి శివశంకర్ అనే వ్యక్తి నుంచి 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై అజయ్‌కుమార్ తెలిపారు. మనుబోలు పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ బద్దెవోలు వాటర్ ట్యాంకు సెంటర్ వద్ద ఓ వ్యక్తి అక్రమంగా మద్యం బాటిళ్లు విక్రయిస్తున్నాడనే సమాచారంతో దాడి చేశామని తెలిపారు. శివశంకర్‌ను అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

